జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 133 ॥ గురువారం ॥ 8-10-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

08 అక్టోబర్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:11 సూర్యాస్తమయం - సా. 5:56 తిథి త్రయోదశి రా. 10:18 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పూర్వ ఫల్గుని(పుబ్బ) రా. 9:18 వరకు తరువాత ఉత్తర ఫల్గుని(ఉత్తర) యోగం శుక్ల రా. 12:51ం వరకు కరణం గరజి ఉ. 10:45 వరకు వనిజ రా. 10:18 వరకు వర్జ్యం తె. 5:33 నుండి ఉ. 7:08 వరకు దుర్ముహూర్తం ఉ. 10:06 నుండి ఉ. 10:53 వరకు మ. 2:48 నుండి మ. 3:35 వరకు రాహుకాలం మ. 1:31 నుండి మ. 2:59 వరకు యమగండం ఉ. 6:11 నుండి ఉ. 7:39 వరకు గుళికాకాలం ఉ. 9:07 నుండి ఉ. 10:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:35 నుండి తె. 5:23 వరకు అమృత ఘడియలు మ. 3:00 నుండి సా. 4:35 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:40 నుండి మ. 12:27 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాటం

సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిల్లీలో ప్రజాస్వామ్యయుతంగా చేపట్టిన ఆందోళనను అడ్డుకోవడం మోదీ, అమిత్ షా.. నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. అరెస్ట్ అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్, ప్రియాంకను కలిసేందుకు యత్నించిన రేవంత్‌రెడ్డి, కేరళ సీఎం వీడీ సతీశన్‌ను పోలీసులు అడ్డుకున్నారు.

**దిల్లీ, అక్టోబర్ 7 :** పోలీసుల చర్యను రేవంత్ తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. "సర్‌ను తక్షణమే నిలిపివేయాలి. ప్రజల ఓటు హక్కును ఈసీ హరిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ ఓట్ల టార్గెట్‌గా కుట్ర జరుగుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాడతాం. ఎన్నికల్లో గెలవడానికి ఈడీ, సీబీఐని వాడేవారు. ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారు" అని రేవంత్‌రెడ్డి విమర్శించారు.



## సీఈసీపై విపక్షాల సమరం

రెండో రోజూ ఢిల్లీలో ఇండీ కూటమి ఆందోళనలు

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్

జంతర్‌మంతర్‌కు తరలిన ఎంపీలు.. కేంద్రంపై తీవ్ర విమర్శలు

# జీఎస్‌ఎంఏతో... ప్రధాని మోదీ



### సమ్మిళిత అభివృద్ధికి సాంకేతికత వినియోగం అవసరం

### భారత్ డిజిటల్ మార్పును ప్రశంసించిన ప్రతినిధులు

మొబైల్ మహాసభకు సన్నాహాలు.. సాంకేతిక భాగస్వామ్యాలపై చర్చ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రపంచ మొబైల్ సమాచార వ్యవస్థల సంఘం పాలక మండలి సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని కూడా పాల్గొన్నారు. సాంకేతిక రంగంలో ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలు, డిజిటల్ అభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ, సాంకేతికత కేవలం పురోగతికి మాత్రమే కాకుండా సమ్మిళిత, స్థిరమైన అభివృద్ధికి కూడా సాధనంగా మారాలని పేర్కొన్నారు.

సాంకేతిక ఆవిష్కరణల ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చర్యలు అవసరమని అన్నారు. భారత్‌లో గత కొన్నేళ్లుగా చోటుచేసుకున్న డిజిటల్ మార్పు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. డిజిటల్ సేవల విస్తరణ, సాంకేతిక మౌలిక వసతుల అభివృద్ధి, ప్రపంచ స్థాయి భాగస్వామ్యాల పెరుగుదలను వారు ప్రశంసించారు. భారత్ ప్రపంచ సాంకేతిక రంగంలో కీలక కేంద్రంగా ఎదుగుతోందని ప్రతినిధులు పేర్కొన్నారు. సమాచార సాంకేతికత, దూరసంప్రేషణ రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతి ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని (మిగతా 2వ పేజీలో)



## తెలంగాణ రక్షణ సేనలోకి బీజేపీ నేతలు

ఖానాపూర్‌లో రాజకీయ సమీకరణాలకు కొత్త మలుపు

కల్వకుంట్ల కవిత సమక్షంలో కండువా కప్పుకున్న నాయకులు

ఇంద్రవెల్లి సంకల్ప సభ విజయవంతానికి పిలుపు

నిర్మల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సుంచు ఎల్లయ్య తెలంగాణ రక్షణ సేనలో చేరారు. ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల నాయకులతో కలిసి ఆయన పార్టీ కండువా కప్పుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ చేరికలతో ఖానాపూర్ ప్రాంతంలో పార్టీ బలోపేతానికి కొత్త ఊపు లభిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

నిర్మల్, అక్టోబర్ 7 : బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగా చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో తమ పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో చర్చించారు. గ్రామస్థాయిలో ప్రజలతో మరింత మమేకమై పార్టీ బలాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టేకం లక్ష్మణ్, గడ్డం భీముడు, కె. రాజేందర్, కస్తూరి అర్జున్, శ్రీపెల్లి శేఖర్ వంటి సర్పంచులు కూడా చేరారు. వీరితో పాటు ఉప (మిగతా 2వ పేజీలో)



## డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించేది లేదు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే విద్యుత్ డిమాండ్ అత్యధిక స్థాయికి చేరిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. "20 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కొందరు నేతలు తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళపరుస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. అవసరాలకు తగ్గట్టు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

హైదరాబాద్, అక్టోబర్ 7: డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కోను ప్రైవేటీకరించే ఆలోచనే లేదు. విద్యుత్ సంస్థలను లిస్టెడ్ కంపెనీలుగా మార్చే ప్రతిపాదన లేదు. పదేళ్లు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు అలా మాట్లాడటం సరికాదు. విద్యుత్ సిబ్బందిని కించపరిచే విధంగా రాజకీయ నేతలు విమర్శలు చేస్తున్నారు. (మిగతా 2వ పేజీలో)



## హరీశ్‌రావుకు జూపల్లి కౌంటర్

వాస్తవాలు తెలుసుకుని విమర్శించాలి

మద్యం అమ్మకాలపై గణాంకాలతో వివరణ

బీఆర్ఎస్ పాలనపైనే మంత్రి విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 7 : బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఘాటుగా స్పందించారు. తాను ఎక్కడా శ్రీశైలం నీటిని బీర్ల తయారీకి వినియోగిస్తామని చెప్పలేదని స్పష్టం చేశారు. డిండి ప్రాజెక్టుకు శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి నీటిని మళ్లిస్తే తెలంగాణకు ప్రయోజనం ఉంటుందని మాత్రమే చెప్పానని వివరించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ విమర్శలు చేయడం -2వ పేజీలో



## డీ.ఈ. షా ఇండియా 30వ వార్షికోత్సవం

హైదరాబాద్‌లో కొత్త కార్యాలయ ప్రకటన.. వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, అక్టోబర్ 7 : డీ.ఈ. షా ఇండియా సంస్థ 30వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పాల్గొని సంస్థ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. వేడుకల్లో మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు, ప్రపంచ స్థాయి సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు, తమ కార్యకలాపాలను విస్తరించేందుకు (మిగతా 2వ పేజీలో)




# మోదీ ప్రజాసేవకు నివాళి

## సేవా జ్యోతి కలశ యాత్రలో ఎంపీ ఈటెల

అల్వాల్‌లో ఘనంగా సేవా సంకల్ప కార్యక్రమం.. వికసిత భారత్ లక్ష్యాలపై పిలుపు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా అల్వాల్‌లో నిర్వహించిన వికసిత భారత్ సేవా జ్యోతి కలశ యాత్రలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

# నేటి రాశి ఫలాలు

మేషం: చిన్ననాటి మిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు. బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో కొత్త బాధ్యతల వలన విశ్రాంతి ఉండదు. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

వృషభం: ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో సొంత నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. సమాజంలో ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

మిధునం: వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణిస్తాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఆప్తుల నుంచి శుభవార్తలు అందుతాయి. దూరపు బంధువులను కలుసుకుంటారు.

కర్కాటకం: దైవానుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగమున అధికారులతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

సింహం: ముఖ్యమైన వ్యవహారాలు నిరాశ పరుస్తాయి. దాయదులతో ఆస్తి వివాదాలు మరింత చికాకు పరుస్తాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. బంధు మిత్రులతో మాటపట్టింపులు తప్పవు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో ఊహించని మార్పులు కలుగుతాయి.

కన్య: మిత్రుల కలయిక మరింత ఆనందం కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభాల బాటలో సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. భూ సంబంధిత క్రయవిక్రయాలలో అనుకూల ఫలితాలు పొందుతారు. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

తుల: దీర్ఘకాలిక వివాదాలు తీరి ఊరట చెందుతారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలలో ఆటంకాలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. సన్నిహితులతో గృహమున సఖ్యతగా వ్యవహరిస్తారు.

వృశ్చికం: చేపట్టిన పనులలో అధిక శ్రమతో ఫలితాన్ని పొందుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆరోగ్యం మీద అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి.

ధనస్సు: ముఖ్యమైన పనులు వ్యయ ప్రయాసలతో గాని పూర్తి కావు. బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి వ్యాపారాలలో చికాకులు అధికమవుతాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు.

మకరం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు.

కుంభం: ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు కలుగుతాయి. నూతన ఋణాలు చేస్తారు. బంధువులతో స్వల్ప వివాదాలు తప్పవు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగస్థులకు స్థానచలన సూచనలు ఉన్నవి.

మీనం: ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయగలుగుతారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.



# హరీశ్‌రావుకు జూపల్లి కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

సరికాదని జూపల్లి అన్నారు. ఎల్‌నినో ప్రభావం, మద్యం అమ్మకాలు వంటి వేర్వేరు అంశాలను ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వాస్తవాలను తెలుసుకోకుండా విమర్శలు చేయడం బాధ్యతాయుత రాజకీయాలకు తగదని పేర్కొన్నారు. మద్యం అమ్మకాల అంశంపై బీఆర్ఎస్ ప్రభుత్వానిదే ప్రధాన బాధ్యత అని మంత్రి ఆరోపించారు. అధికారిక గణాంకాల ప్రకారం 2014-15లో తెలంగాణలో మద్యం అమ్మకాల విలువ రూ.8,846 కోట్లు ఉండగా, 2022-23 నాటికి అది రూ.35,145 కోట్లకు చేరిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో మద్యం అమ్మకాలు రూ.26,299 కోట్లు పెరిగి దాదాపు 297 శాతం వృద్ధి చెందాయని పేర్కొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి భిన్నంగా ఉందని జూపల్లి వివరించారు. 2023-24లో రూ.36,493 కోట్లుగా ఉన్న మద్యం అమ్మకాల విలువ 2025-26 నాటికి రూ.40,209 కోట్లకు చేరిందని తెలిపారు. ఈ పెరుగుదల కేవలం 10 శాతం మాత్రమేనని పేర్కొంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. మద్యం విక్రయాల ద్వారా రాష్ట్ర ఖజానాను నింపింది ఎవరో ప్రజలకు తెలుసని మంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్ల పాలనలో మద్యం విక్రయాలను భారీగా పెంచిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆశ్చర్యకరమని అన్నారు. గణాంకాలు, అధికారిక లెక్కలు తమ వాదనకు బలంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం కంటే ప్రజలకు నిజాలు చెప్పడం అవసరమని జూపల్లి కృష్ణారావు సూచించారు. తాను గణాంకాలతో మాట్లాడుతున్నానని, ఈ అంశంపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని మంత్రి వ్యాఖ్యానించారు.

# మోదీ ప్రజాసేవకు నివాళి

హైదరాబాద్, అక్టోబర్ 7 :

శోభా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించిన అనంతరం సేవా జ్యోతి కలశ యాత్రను ప్రారంభించారు. శోభా గార్డెన్స్ నుంచి శివాజీ చౌక్, కానజిగూడ పెట్రోల్ బంక్ వరకు యాత్ర కొనసాగింది. యాత్రలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మోదీ అందిస్తున్న నాయకత్వం స్ఫూర్తిదాయకమని అన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా మోదీ 25 ఏళ్ల ప్రస్థానం దేశ చరిత్రలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాల ద్వారా సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. మోదీ



ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ఈ సేవా జ్యోతి కలశ యాత్ర స్థానికంగా విశేష స్పందన పొందింది. దేశాభివృద్ధి, సేవా భావం, ప్రజల భాగస్వామ్యంతో వికసిత భారత్ నిర్మాణం సాధ్యమవుతుందని ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు.

# డీ.ఈ.షా ఇండియా 30వ వార్షికోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని తెలిపారు. పరిశ్రమలు, సేవారంగ సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. డీ.ఈ. షా ఇండియా మూడు దశాబ్దాలుగా సాధించిన విజయాలను మంత్రి అభినందించారు. సాంకేతికత, ఆర్థిక సేవలు, పరిశోధన రంగాల్లో సంస్థ విశిష్టమైన సేవలు అందిస్తోందని అన్నారు. హైదరాబాద్‌ను తమ అభివృద్ధి కేంద్రంగా ఎంచుకోవడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొ న్నారు. కొత్త కార్యాలయం ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రపంచ స్థాయి సంస్థల విస్తరణతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పాటు లభిస్తుందని చెప్పారు. యువతకు నైపుణ్యాధారిత ఉద్యోగ అవకాశాలు కల్పించ డంలో ఇటువంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ ఇప్పటికే సాంకేతిక, ఆవిష్కరణల కేంద్రంగా గుర్తింపు పొందిందని శ్రీధర్ బాబు అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలు నగరాన్ని తమ కార్యకలాపాల కేంద్రంగా ఎంచుకుంటున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులైన మానవ వనరులు హైదరాబాద్ ప్రత్యేకతగా నిలుస్తున్నాయని వివరించారు. డీ.ఈ.షా ఇండియా బృందానికి మంత్రి మరోసారి అభినం దనలు తెలియజేశారు. సంస్థ భవిష్యత్తులో మరిన్ని విజ యాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఇలాంటి సంస్థల భాగస్వామ్యం మరింత బలపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రామాభివృద్ధికి కట్టుబాటు

## ప్రజల సమస్యలు తెలుసుకున్న మంత్రి పొన్నం

## మహిళా సంఘాలకు రుణాల పంపిణీ

రామంచ, అక్టోబర్ 7 :

"పల్లె పల్లెకు పొన్నమన్న -పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రామంచ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ పర్యటన సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు రూ.40 లక్షల బ్యాంకు అనుసంధాన రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రామంచ గ్రామ అభివృద్ధికి రూ.5.24 కోట్ల విలువైన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రామంచ--ములకనూరు రహదారి అభివృద్ధికి రూ.3.60 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అలాగే మూడు చెరువుల మత్తడి నీరు దాటే ప్రాంతాల్లో కల్వర్టులు, రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే రాకపోకలు సులభతరం కావడంతో పాటు గ్రామ ప్రజలకు మరింత



సౌకర్యం కలుగుతుందని వివరించారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, తాగునీటి సరఫరా, రహదారులు, మురుగునీటి పారుదల వంటి రంగాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రామంచలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# సీఈసీపై విపక్షాల సమరం

## రెండో రోజూ ఢిల్లీలో ఇండీ కూటమి ఆందోళనలు

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్

## జంతర్‌మంతర్‌కు తరలిన ఎంపీలు.. కేంద్రంపై తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 7 :

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ ఇండీ కూటమి చేపట్టిన ఆందోళనలు రెండో రోజూ ఢిల్లీలో కొనసాగాయి. ఎన్నికల సంఘం వ్యవహార తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న విపక్షాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించాయి. దేశవ్యాప్తంగా ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఇండీ కూటమి నేతలు వెల్లడించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ నిరసనలు జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారాయి. మొదటి రోజు ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన విపక్ష ఎంపీలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమను ఎన్నికల సంఘం కలవడానికి నిరాకరించిందని ఆరోపించిన నేతలు, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అనుచిత పరిణామమని విమర్శించారు. లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన వందలాది మంది ప్రజాప్రతినిధులు కలిసి ఎన్నికల సంఘాన్ని కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ పరిణామంతో విపక్షాల ఆందోళన మరింత తీవ్రరూపం దాల్చింది. రెండో రోజు జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని కొనసాగించిన ఇండీ కూటమి నేతలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతకు భంగం కలుగుతోందని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు విపక్షాలు ఐక్యంగా పోరాడతాయని స్పష్టం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ జ్ఞానేశ్ కుమార్ పదవిలో కొనసాగేందుకు నైతిక అర్హత కోల్పోయారని ఆరోపించారు. ఆయన రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే చర్యలను సహించబోమని పేర్కొంటూ దేశవ్యాప్తంగా ప్రజలకు ఈ అంశాన్ని వివరించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమపై కేసులు పెట్టినా వెనక్కి తగ్గబోమని, వాటిని గౌరవ చిహ్నాలుగా భావిస్తామని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారం దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఎన్నికల సంఘం స్వతంత్రత, రాజ్యాంగబద్ధ సంస్థల పాత్ర, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు మరోసారి రాజకీయ కేంద్రబిందువుగా మారాయి. విపక్షాలు నిరసనలను విస్తరించేందుకు సిద్ధమవుతుండగా, కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల సంఘం స్పందనపై అందరి దృష్టి నెలకొంది. రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ ఆందోళనలు రానున్న రోజుల్లో మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్లమెంట్ వెలుపల ప్రారంభమైన ఈ రాజకీయ పోరాటం దేశవ్యాప్తంగా విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికల వ్యవస్థపై లేవనెత్తుతున్న ప్రశ్నలు, విపక్షాల డిమాండ్లు, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలు జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

# జీఎస్ఎంఏతో ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

అభినందించారు. ఈ సమావేశం భారత్‌లో నిర్వహించనున్న పదో మొబైల్ మహాసభకు ముందు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. న్యూఢిల్లీలో జరిగే ఈ మహాసభలో ప్రపంచ సాంకేతిక, దూరసంప్రేషణ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. కొత్త సాంకేతిక ధోరణులు, ఆవిష్కరణలపై చర్చలు జరగనున్నాయి. భారత్ డిజిటల్ భవిష్యత్తు నిర్మాణంలో ప్రపంచ దేశాలతో కలిసి ముందుకు సాగుతుందని ప్రధాని మోదీ తెలిపారు. సాంకేతిక రంగంలో సహకారాన్ని మరింత విస్తరించి, ప్రపంచ అభివృద్ధికి భారత్ తన వంతు పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

# తెలంగాణ రక్షణ సేనలోకి బీజేపీ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

సర్పంచులు పి. రాజు, చింటు కాంతి, గంపల భూమన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామ్ సింగ్, షిండే సదాశివ, మాజీ సర్పంచులు ఎ. శంకర్ తదితరులు పార్టీలో చేరడం విశేషంగా నిలిచింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు సమిష్టిగా పనిచేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. అలాగే నాయకపోడ్, కోలం తదితర గిరిజన సంఘాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేనలో చేరారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, గ్రామీణ అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై పార్టీ చేస్తున్న కృషి తమను ఆకర్షించిందని వారు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు.

# జెన్‌కోను ప్రైవేటీకరించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఊహించుకుని మాట్లాడటం వల్ల రాష్ట్రానికే నష్టం. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల భారీగా విద్యుత్ డిమాండ్ పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ పాపం ఎవరిది? ఒక పవర్ ప్లాంట్ పెట్టేముందు.. అవసరమైన కోల్ చూసుకుని పెడతారు. సింగరేణి నుంచి యాదాద్రికి గ్రేడ్ 9 కోల్ సప్లయ్ చేస్తామని చెప్పారు. బొగ్గు సరఫరాకు ఒప్పందం చేసుకుని సప్లయ్ చేయలేదు. మొదటి నుంచి కోల్ అలాట్‌మెంట్ లేకుండానే యాదాద్రి పవర్ ప్లాంట్ కట్టారు" అని భట్టి విక్రమార్క తెలిపారు.

శ్వేత

# సంపాదకీయం

**గురువారం 8-10-2026**

# దేశమే ప్రథమం, పౌరుడే ప్రథమం...

మోదీ 25 ఏళ్ల పాలనలో, మారినది, మారనిది... ఒక నాయకుడు, మూడు దశలు, పాతికేళ్ల ప్రయాణం... 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలైన నరేంద్ర మోదీ ప్రభుత్వాధినేత ప్రస్థానం 2014లో దిల్లీకి చేరింది. 2024లో మూడోసారి ప్రధానిగా ప్రజాతీర్పు పొందిన ఆయన 2026 అక్టోబరు 7 నాటికి పాతికేళ్ల నిరంతర పాలనను పూర్తి చేశారు. ఇది ఒక వ్యక్తి రాజకీయ ప్రస్థానం మాత్రమే కాదు. భారత పాలనలో వచ్చిన మార్పులను అంచనా వేయడానికి దొరికిన సుదీర్ఘ కాలప్రమాణం.

గుజరాత్ ప్రయోగశాల (2001--2014).

భూకంపానంతర గుజరాత్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీకి తొలి సవాలు పరిపాలనపై పట్టు సాధించడం. అక్కడి నుంచే ఆయన పాలనా నమూనాకు పునాది పడింది. విద్యుత్ సరఫరా, పారిశ్రామికీకరణ, మౌలిక వసతులు, పెట్టుబడుల ఆకర్షణతో పాటు ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి స్వాగత్ వంటి వ్యవస్థలు ఏర్పడ్డాయి. వైబ్రంట్ గుజరాత్ ద్వారా పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యమిచ్చారు. వరుస ఎన్నికల విజయాలు ఆయన నమూనాకు రాజకీయ ఆమోదాన్ని తెచ్చాయి. గుజరాత్ నమూనా నుంచి జాతీయ నమూనాకు (2014--2024). ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అసలు మార్పు పరిమాణంలో వచ్చింది. జన్‌ధన్ ఖాతాలు, ఆధార్, మొబైల్ అనుసంధానం, ప్రత్యక్ష నగదు బదిలీలు సంక్షేమాన్ని ఇంటి గడపకు చేర్చే ప్రయత్నాన్ని వేగవంతం చేశాయి. యూపీఐ సామాన్యుడి ఆర్థిక లావాదేవీలనే మార్చింది. స్వచ్ఛ భారత్, ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, పీఎం-కిసాన్ వంటి పథకాలు విస్తృత స్థాయిలో అమలయ్యాయి.

ఇదే దశలో మౌలిక వసతులపై భారీ దృష్టి కనిపించింది. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, వందే భారత్ వంటి ప్రాజెక్టులు వేగాన్ని పెంచాయి. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి నిర్ణయాలు మాత్రం తీవ్ర చర్చకు, విమర్శలకు దారితీశాయి. అంటే ఈ దశలో మార్పు వేగం పెరిగింది, అదే సమయంలో మార్పు వ్యయంపై చర్చ కూడా పెరిగింది. జాతీయ భద్రతలోనూ వైఖరి మారింది. 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ దాడులు, ఆ తర్వాతి భద్రతా నిర్ణయాలు ఉగ్రవాదంపై కఠిన ప్రతిస్పందనకు సంకేతాలుగా నిలిచాయి. ఆర్టికల్ 370 రద్దు, సీడీఎస్ ఏర్పాటు వంటి నిర్ణయాలు కూడా ఈ దశలోనే చోటుచేసుకున్నాయి. ప్రపంచ వేదికపై భారత్ (2024--2026).

మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ పాలనకు మరో కొలమానం జోడైంది, భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే దీర్ఘకాలిక లక్ష్యం. జీ20 అనుభవం, గ్లోబల్ సౌత్‌లో నాయకత్వం, వ్యూహాత్మక స్వతంత్రత, వికసిత్ భారత్--2047 లక్ష్యం ఈ దశకు కేంద్రబిందువులు. 2025 ఆపరేషన్ సిందూర్ వంటి పరిణామాలు భద్రతా విధానంలోనూ నిరంతరతను చూపించాయి.

25 ఏళ్లలో పాలనా సాధనాలు మారాయి. ప్రభుత్వం పౌరుడిని చేరే మార్గం మారింది. డిజిటల్ సాంకేతికత పాలనలోకి వచ్చింది. ప్రపంచ వేదికపై భారత స్వరం బలపడింది. కానీ సామాన్యుడి ప్రాథమిక ఆకాంక్షలు మాత్రం మారలేదు. యువతకు ఉద్యోగం, రైతుకు స్థిరమైన ఆదాయం, కుటుంబానికి అందుబాటు ధరలు, మధ్యతరగతికి ఆర్థిక భద్రత, అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, సమాజంలో సామరస్యం, ఇవే ఇప్పటికీ అసలు కొలమానాలు. అందుకే మోదీ 25 ఏళ్లను మూడు దశలుగా చదవాలి.... గుజరాత్‌లో ప్రయోగం, డిల్లీలో విస్తరణ, ప్రపంచ వేదికపై ప్రతిష్ఠ. అయితే నాలుగో దశకు పునాది ఇప్పుడు వేయాల్సి ఉంది, అభివృద్ధి ఫలితాలను ప్రతి పౌరుడి జీవితంలో శాశ్వతంగా నిలిపే దశ. దేశమే ప్రథమం, పౌరుడే ప్రథమం... అనే నినాదానికి తుది పరీక్ష కూడా అక్కడే. దేశం ఎంత ఎదిగిందన్నదే కాదు, ఆ ఎదుగుదలలో చివరి పౌరుడి జీవితం ఎంత మెరుగుపడిందన్నదే చరిత్ర ఇచ్చే తుది తీర్పు.

# ప్రశ్నించే యువతే దేశ ప్రజాస్వామ్యానికి బలం: ధర్మేంద్ర




కుషాయిగూడ సెప్టెంబర్ 7 (స్టార్ న్యూస్) : ప్రశ్నించే యువతే దేశ ప్రజాస్వామ్యానికి బలమని, యువత, విద్యార్థుల ప్రశ్నలకు ప్రభుత్వాలు సమాధానం చెప్పాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఏఐవైఎఫ్ జాతీయ సమితి సమావేశాలు 5,6 తేదీల్లో ముంబాయిలోని కామ్రేడ్ భూపేష్ గుప్తా భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ, దేశంలో విద్యార్థులు, యువతలో పెరుగుతున్న ప్రశ్నించే తత్వాన్ని స్వాగతించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రశ్నించడం, ఎన్నికల వ్యవస్థ, విద్య, ఉద్యోగాలు, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కులపై వివరణ కోరడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమని తెలిపారు. ఇటీవల ఓటర్ల జాబితాల మార్పులపై యువత,విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసనలు కూడా ప్రజాస్వామ్య సంస్థల పారదర్శకతపై కొనసాగుతున్న ప్రజా చర్చను ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. ప్రశ్నించే యువతను అణచివేయడం కాదని, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు. దేశ యువతకు కావాల్సింది కేవలం నినాదాలు, ప్రచార కార్యక్రమాలు కాదని, నాణ్యమైన విద్య, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, గౌరవప్రదమైన ఉపాధి, పేపర్ లీక్‌లకు శాశ్వత పరిష్కారం, సామాజిక సమానత్వం, శాస్త్రీయ దృక్పథం, స్వేచ్ఛగా ప్రశ్నించే హక్కు, రాజ్యాంగ సంస్థల పారదర్శకత అని వారు పేర్కొన్నారు. 2026లో 15--29 ఏళ్ల యువత నిరుద్యోగిత రేటు 22.9%గా నమోదైన నేపథ్యంలో యువత భవిష్యత్తుపై మరింత స్పష్టమైన ఉపాధి విధానాలు అవసరమని గణాంకాలు సూచిస్తున్నాయని అన్నారు. ఉద్యోగం, విద్య, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం యువత గొంతు బలంగా వినిపించాలని అన్నారు.



# స్నేహం సేవ=సామాజిక బాధ్యత

**మేడ్చల్-మల్కాజిగిరి**

**కోర్టుకు ఫర్నిచర్ వితరణ**



చర్లపల్లి, అక్టోబర్ 7 (స్టార్ న్యూస్) : సామాజిక సేవలో భాగంగా చర్లపల్లి ఇండస్ట్రియల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ (సిఐఎఫ్ఏ) ఆధ్వర్యంలో కుషాయిగూడలోని మేడ్చల్-మల్కాజిగిరి కోర్టుకు రూ.2 లక్షల విలువైన 40 బెంచీలను అందజేశారు. కోర్టుకు ప్రతిరోజూ వచ్చే న్యాయవాదులు, కక్షిదారులు మరియు సందర్శకుల సౌకర్యార్థం ఈ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోర్టు పరిపాలనా విభాగం తరఫున అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీ అలీ అస్గర్, కోర్టు నజీర్ శ్రీ భాస్కర్ పాల్గొన్నారు. మల్కాజిగిరి బార్ అసోసియేషన్ తరఫున అధ్యక్షులు శ్రీ టి. రత్నయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.దుర్గాప్రసాద్, కోశాధికారి శ్రీ పుణ్యరాజు, కార్యవర్గ సభ్యులు మరియు న్యాయవాదులు పాల్గొన్నారు. సిఐఎఫ్ఏ తరఫున జక్కా రోషి రెడ్డి, కె.వెంకట రత్నం, పి.భీముడు, కిషోర్ కుమార్, కిషోర్, ఎం.వి.ఎస్. మూర్తి, కె.గోపాలకృష్ణ, హరిహర సుబ్రహ్మణ్యం, రాము, శివాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొని బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి బార్ అసోసియేషన్ కార్యవర్గం పారిశ్రామికవేత్తలయిన స్నేహితులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. వారు అందించిన 40 బెంచీలు న్యాయవాదులు, కక్షిదారులు మరియు కోర్టుకు వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొం టూ, ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, స్నేహంతో ఒక్కటై... సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడమే తమ లక్ష్యమని తెలిపారు. సభ్యుల సహకారంతో అవసరం ఉన్న చోట ప్రజోపయోగ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని వారు వెల్లడించారు. ఇటీవల ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లో ఆర్వో మంచినీటి ప్లాంట్ ఏర్పాటు చేసిన సిఐఎఫ్ఏ, ఇప్పుడు మల్కాజిగిరి కోర్టుకు 40 బెంచీలు అందించడం ద్వారా మరో ప్రజోపయోగ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. రానున్న రోజుల్లో విద్య, వైద్యం, తాగునీరు, పేద విద్యార్థులకు సహాయంలి మరియు ఇతర సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.




# జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలోఅవగాహన సదస్సులు

బోడుప్పల్, అక్టోబర్ 07(స్టార్ న్యూస్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్/మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి.బాల భాస్కర్ రావు ఆదేశాల మేరకు బుధవారం సీనియర్ సిటిజన్లు, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బోడుప్పల్ మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో, చెంగిచెర్లలోని జెడ్ పి ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు. మల్లికార్జున నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జిఎస్ఎల్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ల హక్కులు, వారికి చట్ట పరంగా ఉన్న రక్షణలు, జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న న్యాయ సేవల గురించి వివరించారు. అవసర మైన వారు న్యాయ సేవలను వినియోగిం చుకోవాలని సూచించారు. అనంతరం చెంగిచెర్ల జెడ్ పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులోనూ జిఎస్ఎల్ ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు చట్టపర మైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం, మంచి స్పర్శ--చెడు స్పర్శ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ చట్టాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చెడు వ్యసనాలు, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ గేమ్స్, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా చెడు ప్రవర్తనకు పాల్పడినా, ప్రలోభాలకు గురిచేసినా లేదా ఇబ్బందులకు గురిచేసినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని జడ్జి ప్రియాంక సూచించారు. సమస్యలను దాచిపెట్టకుండా పెద్దల దృష్టికి తీసుకువచ్చి తగిన సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పారా లీగల్ వాలంటీర్లు సుజాత నాయుడు, వేణుగోపాల్, మల్లికార్జున నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, చెంగిచెర్ల జెడ్ పి ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంపై ఆరోపణలు.. కాంగ్రెస్‌లో ఎందుకీ మౌనం?

**రేవంత్ ఆస్తులపై బీఆర్ఎస్ ఆరోపణలు**

**కాంగ్రెస్ సీనియర్ల స్పందన ఏది?**

**కేటీఆర్‌కు అండగా నిలిచిన బీఆర్ఎస్**

**రేవంత్‌కు కాంగ్రెస్ దూరమా?**

**మౌనం వెనుక కారణమేంటి?**

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆస్తులు, వ్యాపార వ్యవహారాలపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. ప్రతిపక్షం నుంచి ఆరోపణలు రావడం రాజకీయాల్లో సహజమే. అయితే ఆరోపణలు తీవ్రతరం అవుతున్న సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యంగా సీనియర్ నేతల స్థాయిలో సమష్టి స్పందన కనిపించకపోవడం మాత్రం చర్చనీయాంశంగా మారింది. సీఎం తరఫున ప్రభుత్వపరమైన వివరణలు వస్తున్నప్పటికీ.. పార్టీ నాయకత్వం మొత్తం ఒకే స్వరంతో ఎదురుదాడికి దిగకపోవడం వెనుక కారణమేంటన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

బీఆర్ఎస్ వాదనలపై కాంగ్రెస్ నేతలు స్పష్టమైన రాజకీయ సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిరాధారమైనవైతే వాటిని ఆధారాలతో ఖండించడం, నిజమైన వాస్తవాలను ప్రజల ముందుంచడం అధికార పార్టీ బాధ్యత. అదే సమయంలో ప్రతి ఆరోపణకు పార్టీ మొత్తం స్పందించాల్సిన అవసరం లేదనే వాదన కూడా ఉంది. ముఖ్యమంత్రి వ్యక్తిగత ఆస్తులు, వ్యాపార వ్యవహారాలకు సంబంధించిన అంశాలకు చట్టపరమైన, అధికారిక వివరణలు అవసరమైతే వాటిని సంబంధిత వేదికలపై ఇవ్వవచ్చు. కానీ రాజకీయంగా చూస్తే మౌనం కూడా ఒక సందేశాన్ని ఇస్తుంది.

ఇక్కడే కేటీఆర్ విషయంలో బీఆర్ఎస్ అనుసరించిన రాజకీయ వ్యూహంతో పోలిక తెరపైకి వస్తోంది. కేటీఆర్‌పై ఆరోపణలు వచ్చినప్పుడు పార్టీ ముఖ్య నేతలు ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు గతంలో విమర్శించాయి. అదే తరహాలో ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు వస్తున్నప్పుడు కాంగ్రెస్ సీనియర్ నేతలంతా ఎందుకు ఒకే వేదికపైకి రావడం లేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే రెండు సందర్భాల్లోని ఆరోపణల స్వభావం, ఆధారాలు, రాజకీయ నేపథ్యం వేర్వేరుగా ఉండొచ్చన్న విషయాన్ని కూడా విస్మరించలేం.

మరో కోణంలో చూస్తే.. అధికార పార్టీలోని సీనియర్ నేతల మౌనం అంతర్గత రాజకీయాలకు సంకేతమా అన్న చర్చ కూడా మొదలైంది. సీఎం నాయకత్వంపై పార్టీకి పూర్తి విశ్వాసం ఉంటే, ప్రతిపక్షాల ఆరోపణలను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ సమష్టిగా ఎందుకు ముందుకు రావడం లేదన్నది రాజకీయ విశ్లేషకుల ప్రశ్న. అయితే ఇది నిజంగానే అసమ్మతికి సంకేతమా, లేక ఆరోపణలకు వ్యక్తిగతంగా సమాధానం ఇవ్వడం సరిపోతుందని పార్టీ భావిస్తోందా అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది.



ఇలాంటి ఆరోపణల విషయంలో రాజకీయ నినాదాల కంటే పారదర్శకతే కీలకం. బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు నిజమని కాంగ్రెస్ భావిస్తుందా? లేక పూర్తిగా నిరాధారమని భావిస్తుందా? అన్నదానిపై అధికార పార్టీ స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. ఆరోపణలు తప్పైతే ఆధారాలతో ఖండించాలి.. వాస్తవాలుంటే వాటిపై చట్టపరమైన విచారణకు సిద్ధమని చెప్పాలి. వ్యక్తిగత దూషణలు, రాజకీయ ఆరోపణలతో వ్యవహారాన్ని మళ్లించడం కంటే వాస్తవాలను ప్రజల ముందు ఉంచడం ద్వారా మాత్రమే ఈ వివాదానికి తెరపడే అవకాశం ఉంది.

మొత్తానికి అందరి మెదళ్లలో తిరుగుతున్న ప్రశ్న ఒక్కటే.... కేటీఆర్‌పై ఆరోపణలు వచ్చినప్పుడు బీఆర్ఎస్ మొత్తం ఆయన వెంట నిలబడితే.. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు వచ్చినప్పుడు కాంగ్రెస్ మొత్తం ఎందుకు ఆయన వెంట కనిపించడం లేదు..? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇది కాంగ్రెస్‌లో విభేదాలకు సంకేతమా, లేక రాజకీయ ఆరోపణలకు ప్రతి నేత స్పందించాల్సిన అవసరం లేదనే వ్యూహమా అన్నది కాలమే తేల్చాలి. అయితే ఆరోపణలు ఎంత పెద్దవైతే, వాటిపై అధికార పార్టీ నుంచి అంతే స్పష్టమైన సమాధానం రావాలన్న ప్రజాస్వామ్య అంచనాలు మాత్రం సహజంగానే ఉంటాయి.



# నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం

**స్థానిక ఎన్నికల్లో వైసీపీ దూకుడు.. స్థానిక ఎన్నికల్లో తొలి అభ్యర్థి ప్రకటన**

**నెల్లూరు మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి**

తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ దూకుడు పెంచింది. ఎన్నికల కసరత్తు వేగం పుంజుకున్న నేపథ్యంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా ఆనం విజయ్‌కుమార్‌రెడ్డిని పార్టీ ఖరారు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే పార్టీ తొలి మేయర్ అభ్యర్థి ప్రకటన కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తూ బలమైన అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల వ్యూహాలపై చర్చిస్తున్నారు. నెల్లూరు మేయర్ అభ్యర్థి ప్రకటనతో ఇతర నగరాలు, పట్టణాల్లోనూ వైసీపీ అభ్యర్థుల ఎంపికపై ఆసక్తి నెలకొంది.

నెల్లూరు రాజకీయాల్లో ఆనం కుటుంబానికి ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని విజయ్‌కుమార్‌రెడ్డిని బరిలోకి దింపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు మేయర్ పదవికి ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ, డివిజన్ల వారీగా అభ్యర్థుల ఎంపిక కొనసాగుతున్న నేపథ్యంలో వైసీపీ తొలి అభ్యర్థి ప్రకటనతో నెల్లూరు నగరంలో ఎన్నికల వేడి మరింత పెరిగింది.

# కరువు.. చంద్రబాబు కవల పిల్లలు

**రాయలసీమకు ఏం చేశారు?**

**రూ.24,000 కోట్లు ఎక్కడ?**

**చంద్రబాబుపై రోజా ఫైర్**



చిత్తూరు: రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన లేదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. బుధవారం నగరిలో రాయలసీమపై చంద్రబాబు ప్రదర్శిస్తున్న కపటప్రేమను ఆమె బయటపెట్టారు. రాయలసీమకు రూ. 24 వేల కోట్లతో ప్రాజెక్టులు చేపట్టామని చెబుతున్న ప్రభుత్వం.. వాటి వివరాలు, పురోగతిని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు స్పందించాలని కోరారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రోజా అన్నారు. చంద్రబాబు పాలనలో రాయలసీమలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తూ.. కొత్తగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో అధికారిక లెక్కలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. అమరావతికి ప్రాధాన్యం ఇస్తూ రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె విమర్శించారు. మరోవైపు రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కూటమి నేతలు చెబుతున్నారు. రాయలసీమ రైజింగ్ పేరుతో ప్రాంతంలో పారిశ్రామిక, వ్యవసాయ, ఉద్యానవన రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాగునీటి ప్రాజెక్టులు, కొత్త ఆయకట్టు, పూర్తయిన పనులపై ప్రభుత్వం స్పష్టమైన గణాంకాలు విడుదల చేయాలని రోజా డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ప్రాజెక్టులకు ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని రోజా ఆరోపించారు. దీంతో రాయలసీమ అభివృద్ధిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. రోజా చేసిన ఆరోపణలపై ప్రభుత్వం అధికారికంగా ఏ విధంగా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.





## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండ.. ప్రజల పట్ల జవాబుదారీతనం:బొండా

విజయవాడ: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. 63వ డివిజన్ రాజీవ్‌నగర్‌లో ఏడుగురు కుటుంబాలకు రూ.3.20 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.9 కోట్ల విలువైన ఎల్ఓసీలు, చెక్కులు అందించినట్లు బొండా ఉమా తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పనిచేస్తామని, అధికారం తమకు అలంకారం కాదని, ప్రజల పట్ల జవాబుదారీతనమే తమ బాధ్యత అని పేర్కొన్నారు.



# విజయవాడలో పండుగల సందడి

## విజయవాడలో ఉత్సవాల జాతర

**అతిథులకు విజయవాడ ఆతిథ్యం అందిద్దాం: చిన్ని**

విజయవాడ, అక్టోబర్ 7: వచ్చే పది రోజుల్లో విజయవాడ ఉత్సవాల నగరంగా మారనుందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... ఢిల్లీ తర్వాత విజయవాడలో సరస్ మేళా నిర్వహించడం గర్వకారణమని, ఈ నెల 15న భారత రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఈ నెల 13 నుంచి 30 వరకు జరిగే మేళాలో దేశంలోని అన్ని రాష్ట్రాల డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో 650 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, సుమారు 2,500 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పున్నమి ఘాట్‌లోని 18 ఎకరాల్లో ఒకవైపు సరస్ మేళా, మరోవైపు విజయవాడ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సరస్ మేళా, దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ ఒకేసారి జరగడం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని కేశినేని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల ఆహార ప్రత్యేకతలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎంలు, కేంద్ర మంత్రులు, ఇతర ప్రముఖులు విజయవాడకు రానున్నారని, అమ్మవారి దర్శనం కోసం ప్రముఖుల రాకతో నగరంపై దేశవ్యాప్తంగా మరింత దృష్టి పడుతుందని అన్నారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార కేంద్రాలను అందంగా అలంకరించుకుని ఉత్సవాలకు మరింత శోభ తీసుకురావాలని కోరారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పిల్లలకు 50 రకాల పోటీలు, లైవ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీ తెలిపారు. ఈ నెల 20 వరకు అమ్మవారి ఉత్సవాలు, 30 వరకు సరస్ మేళా కొనసాగుతాయని చెప్పారు. ఏపీ--కర్ణాటక రంజీ మ్యాచ్‌లో అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొనడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు. సరస్ మేళాలో స్టాళ్ల కేటాయింపు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, మూడు ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రజలు, మీడియా సహకరించాలని కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు.



# పేదలకు సొంతింటి కల.. బీఎల్‌సీతో భరోసా

**పేదల సొంతింటికి కూటమి భరోసా**

**బీఎల్‌సీతో రూ.2.50 లక్షల సాయం:ఉమా**



విజయవాడ, అక్టోబర్ 7: పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. రాజీవ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రాహీ 2.0 (దీూజ) పథకం కింద 50 మంది లబ్ధిదారులకు రూ. 1.25 కోట్ల విలువైన ఆర్థిక సహాయానికి సంబంధించిన లేఖలను ఆయన అందజేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ నిర్మాణం కోసం రూ. 2.50 లక్షల వరకు సాయం అందిస్తున్నామని తెలిపారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సుమారు 1,000 మంది లబ్ధిదారులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పిస్తున్నట్లు చెప్పారు. పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని బొండా ఉమా పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు జీఓ నెం.30 ద్వారా శాశ్వత హక్కులు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి డివిజన్‌లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి గృహ నిర్మాణ సహాయం అందిస్తామని, పేదలు, మహిళల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు.






# నేడు 'చలో లోక్‌భవన్'

**ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ ఆందోళన**

**నేడు హైదరాబాద్‌లో చలో లోక్‌భవన్ ర్యాలీ**

**సేవ్ డెమోక్రసీ పేరుతో ఇండియా కూటమి నిరసన**

**సీఈసీ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్**

హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్, ఇండియా కూటమి ఆందోళనకు సిద్ధమయ్యాయి. ఓట్ల సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు హైదరాబాద్‌లో సేవ్ డెమోక్రసీ--చలో లోక్‌భవన్ ర్యాలీ నిర్వహించనున్నారు. పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా అనర్హులు, డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు తొలగిస్తున్నప్పటికీ.. అర్హులైన ఓటర్ల పేర్లు కూడా తొలగిపోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఓటు హక్కును కాపాడేందుకు ప్రజాస్వామ్యవాదులు ఉద్యమించాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టిన ఇండియా కూటమి.. రాష్ట్రస్థాయి ఆందోళనకు సిద్ధమైంది.

హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు నిరసన ప్రారంభించి, అక్కడి నుంచి లోక్‌భవన్ వైపు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, ఇతర ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కూడా కార్యక్రమంలో పాల్గొననున్నాయి. ఇక సీఎం రేవంత్ రెడ్డి ర్యాలీలో పాల్గొంటారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. ఓటు హక్కుల పరిరక్షణపై కాంగ్రెస్ చేపడుతున్న పోరాటానికి ఆయన ఇప్పటికే మద్దతు ప్రకటించినప్పటికీ.. గురువారం కార్యక్రమానికి ఆయన హాజరుపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా




ఖండిస్తోంది. బోగస్, డూప్లికేట్, అనర్హులైన ఓట్లను తొలగించే ప్రక్రియను కాంగ్రెస్ అడ్డుకుంటోందని బీజేపీ విమర్శిస్తోంది. ఎన్నికల సంఘంపై రాజకీయ ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అనుమానాలు సృష్టిస్తున్నారని ఆ పార్టీ నేతలు మండిపడుతున్నారు. దీంతో గురువారం చలో లోక్‌భవన్‌తో తెలంగాణలో ఓటర్ల జాబితా అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కనుంది.



## జాబితాపై మరోసారి ఇంటింటి పరిశీలన

**జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ప్రక్రియను బూత్ స్థాయి అధికారులు 2026 జూన్ 15వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సందర్శన ద్వారా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ఈ ప్రక్రియలో జిల్లాలో మొత్తం 1,23,714 మంది ఓటర్లు ఎ.ఎస్.డి.డి (గూఎంవత్.. అందుబాటులో లేని వారు, రాష్ట్రఅట్వం -- వేరే ప్రాంతానికి తరలిపోయిన వారు, ఐమ్నుం -- మరణించిన వారు, ఐబజూశ్రీఅష్ఫ్వ -- ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదైన వారు) జాబితాలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అనంతరం జూలై 31,2026న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో జిల్లాలో మొత్తం 15,89,731 మంది ఓటర్లు నమోదై ఉన్నారని పేర్కొన్నారు. తదుపరి నోటీసుల ప్రక్రియలో భాగంగా అక్టోబర్ 6, 2026 వరకు మరో 12,786 మంది అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ వివరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని అక్టోబర్ 16,2026న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హత కలిగిన ఒక్క వ్యక్తి కూడా ఓటరుగా నమోదు కాకుండా మిగిలిపోకూడదనే ఉద్దేశంతో ఎ.ఎస్.డి.డి జాబితాపై మరోసారి ఇంటింటి పరిశీలన నిర్వహించడంతో పాటు, కొత్త ఓటర్ల నమోదుకు మరియు ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన వ్యక్తులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు అక్టోబర్ 8,2026 నుంచి బూత్ స్థాయి అధికారులు ఎ.ఎస్.డి.డి జాబితాలోని తొలగించబడిన పేర్లకు సంబంధించి మరోసారి ఇంటింటి సందర్శన చేపడతారని తెలిపారు. పరిశీలనలో ఎవరైనా పొరపాటున ఓటర్ల జాబితా నుంచి తొలగించబడినట్లు తేలితే, వారి నుంచి వెంటనే ఫారం--6 ద్వారా ఓటరుగా నమోదు కోసం దరఖాస్తు స్వీకరించి, నిరంతర ఓటర్ల జాబితా నవీకరణ ప్రక్రియలో భాగంగా వారికి ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఓటర్ల జాబితా నిరంతర నవీకరణ ప్రక్రియను ప్రతి సంవత్సరం జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1 మరియు అక్టోబర్ 1 తేదీలను అర్హత తేదీలుగా పరిగణిస్తూ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తుది ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు తమ అర్హతకు సంబంధించిన పత్రాలతో ఫారం--6 ద్వారా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ కోరారు.



## మహిళల స్వావలంబనకు కుట్టుమిషన్ల పంపిణీ

**పేద కుటుంబాలకు స్వయం ఉపాధే కీలకం: బొండా సిద్ధార్థ.. ఇంటి వద్దే ఉపాధి.. ఆర్థికంగా బలోపేతం కావాలని సూచన**

విజయవాడ, అక్టోబర్ 7: పేద కుటుంబాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడమే లక్ష్యమని టీడీపీ యువ నాయకుడు బొండా సిద్ధార్థ తెలిపారు. సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో 62వ డివిజన్‌కు చెందిన దాశెట్టి జ్యోతి, నక్కా సత్యలకు జీవనోపాధి కోసం కుట్టుమిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ.. తాత్కాలిక సహాయం కంటే మహిళలు నిరంతరం ఆదాయం పొందేలా ఉపాధి అవకాశాలు కల్పించడం ముఖ్యమన్నారు. ఇంటి వద్దే కుట్టుపని చేసుకుంటూ కుటుంబానికి ఆదాయం సమకూర్చుకునే అవకాశం కుట్టుమిషన్ ద్వారా లభిస్తుందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉపాధి ప్రారంభించలేని పేద కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కుట్టుమిషన్లు, ఇతర ఉపాధి పరికరాల పంపిణీ కార్యక్రమాలను కొనసాగిస్తామని సిద్ధార్థ పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, పైడి తులసి తదితరులు పాల్గొన్నారు.



## పీ4 స్ఫూర్తికి ఘన విజయం!

**ఫలించిన జిల్లా కలెక్టర్ చొరవ.. కృపారావు బంగారు విజయం**

కెనడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన క్రీడాకారుడు సంకు కృపారావు బంగారు పతకం సాధించి ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుర్తింపు తెచ్చారు. ఈ విజయం వెనుక ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం పీ4 స్ఫూర్తి పథం కూడా ఉంది. క్రీడాకారున్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ బుధవారం కలెక్టరేట్‌లో అభినందించారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు అవసరమైన ఆర్థిక సహాయం కోసం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశను ఇటీవల కృపారావు కుటుంబ సభ్యులు ఆశ్రయించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో కలెక్టర్ లక్ష్మీశ వెంటనే స్పందించి.. పీ4 ద్వారా సహకారం అందేలా చొరవచూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శిగా ముందుకు వచ్చిన సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను క్రీడాకారుడికి సహాయం అందించేలా అనుసంధానించి.. రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇప్పటికే వివిధ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన కృపారావు కెనడాలో ఇటీవల జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు.

# ఆర్&ఆర్ ప్యాకేజీ పనులు వేగవంతం చేసి నిర్వాసితులకు అందించాలి

**ముదిత్ కుమార్ సింగ్(రిటైర్డ్), పోలవరం ఎన్ ఎం సి అడ్వైజర్ ఆర్ఆర్**

ఏలూరు/జంగారెడ్డిగూడెం, అక్టోబరు 07: జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి ఆర్డఆర్ కాలనీని బుధవారం పర్యవేక్షించి, అక్కడి అధికారులు మరియు గుత్తేదారులతో శ్రీ ముదిత్ కుమార్ సింగ్, ఐ.ఎఫ్.ఎస్.(రిటైర్డ్), NMC Advisor R&R Polavaram సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, కాలనీలో కొనసాగుతున్న నిర్మాణ పనులుపై సంతృప్తి వ్యక్తంపరిచారు. ఈ సందర్భంగా శ్రీ ముదిత్ కుమార్ సింగ్, ఐ.ఎఫ్.ఎస్.(రిటైర్డ్), NMC Advisor R&R Polavaram మాట్లాడుతూ పనులు నాణ్యతను తనిఖీ చేసి, క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు జారీచేశామని అన్నారు. అన్ని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేఅవుట్లలో రైన్ వాటరు హార్వెస్టింగు వ్యవస్థలను ఏర్పాటు చెయ్యాలని, ఫారెస్ట్ డిపార్ట్‌మెంటుతో సమన్వయం చేసుకుని మొక్కలు విరివిగా పెంపకం చేపట్టాలని సూచించామని తెలిపాయి. పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ గోడ లెవెలింగు, సైకిల్ స్టాండు, పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను విద్యాశాఖతో సమన్వయం చేసుకుని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని పరిశీలించి, వంటగదిలో గాలి, వెలుతురు కోసం కిటికీలు ఏర్పాటు చెయ్యాలని సూచించారు. లేఅవుటులో జరుగుతున్న పనులు పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, లబ్ధిదారులు సౌర విద్యుత్తు ప్యానళ్లను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ల్యాబ్ టెస్ట్ సెంటర్‌ను కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మరియు గుత్తేదారులు నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి నిర్వాసితులకు ఇళ్లను అప్పగించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని మిగిలిన ఆర్ ఆర్ కాలనీలలో కూడా పనులను మరింత వేగవంతం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటరు, రాజమహేంద్రవరం వి.అభిషేక్, సూపరింటెండింగు ఇంజనరు శ్రీ సి.జయరామాచారి, గృహనిర్మాణ శాఖ పిడ జి.సత్యనారాయణ, ఐటిడిఏ పివో కె.రాములు నాయక్ , ఇఇలు, డిఇఇలు, మరియు ఇతర ఆర్డఆర్ ప్యాకేజీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో 19 యూనిట్ల ఏర్పాటు

**మునగ ప్రాసెసింగ్‌తో రైతులకు మెరుగైన ఆదాయం**

**యర్రావారిపాలెం, వీరబల్లి యూనిట్లు విజయవంతంపై హర్షం**

**మునగ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

అమరావతి, అక్టోబర్ 7: రైతుల ఆదాయాన్ని పెంపొందించడం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను (ఫీూ ) వ్యాపారపరంగా బలోపేతం చేయడం, గ్రామీణ మహిళలకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (రాజుశ్రా) ద్వారా మునగ విలువ ఆధారిత ప్రాసెసింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు కేవలం మునగ ఆకుల విక్రయానికే పరిమితం కాకుండా ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ ప్రక్రియల్లోనూ భాగస్వాములు అయ్యేలా రాష్ట్ర వ్యాప్తంగా 19 యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వైఎస్సార్ కడప జిల్లా వీరబల్లి, తిరుపతి జిల్లా యర్రావారిపాలెంలో విజయవంతమైన మునగ ప్రాసెసింగ్ యూనిట్‌లను ఆదర్శంగా తీసుకుని ఈ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

స్థానిక వాతావరణం, సాగు విస్తీర్ణం, రైతుల ఆసక్తి, ముడిసరుకు లభ్యత మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ( ఫీూ ) సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ యూనిట్లను ఎంపిక చేస్తున్నట్టు మంత్రి తెలిపారు. తమిళనాడులోని పేరియకుళం హార్టికల్చర్ కళాశాల ఉ పరిశోధనా సంస్థ నుంచి అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను సేకరించి రైతులకు అందించడంతో పాటు, ప్రాసెసింగ్, నాణ్యత నియంత్రణ, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అధ్యయన పర్యటనలు కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలంలో జీవనోపాధుల నిధుల సాయంతో ఏర్పాటు చేసిన ప్లాంట్ నుంచి రోజుకు 250 కేజీల మునగపొడి తయారు చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.

రైతు స్థాయిలో ఒక కేజీ మునగాకు ఉత్పత్తికి రు. 10 ఖర్చు చేస్తుంటే... రైతుల నుంచి ఫీూలు రు. 15కు కొనుగోలు చేస్తుండడంతో రైతులకు ప్రతి కేజీపై రు. 5 లాభం



చేకూరుతుందని మంత్రి తెలిపారు. యర్రావారిపాలెంలో రూ. 86.80 లక్షలతో ఏర్పాటు చేసిన యూనిట్ ద్వారా 300 ఎకరాల నుంచి మునగాకు సేకరణ జరుగుతోందన్నారు. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం ఉపాధి హామీ పథకం కింద ఎకరాకు రూ. 1.30 లక్షల వరకు అభివృద్ధి సహాయం అందుతుందని.. రైతులకు ఈ మునగ సాగు ద్వారా నెలకు రు. 5- 10 వేల మధ్యలో నికర ఆదాయం లభిస్తుందని మంత్రి తెలిపారు. దేశీయ, అంతర్జాతీయంగా మునగ పొడిని పోషకాహార ఉత్పత్తులు, హెల్త్ డ్రింక్స్, హెర్బల్ టీలు, న్యూట్రాస్యూటికల్స్, ఆయుర్వేద ఉత్పత్తులలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారని... సరైన ప్యాకేజీలతో ఈ కామర్స్ వేదికల ద్వారా వీటిని విక్రయించేందుకు సమగ్ర మార్కెటింగ్ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.



## మీ ఆహార సేవకు అమ్మ ఆశీస్సులుండాలి

**దాతలు ముందుగా కలెక్టరేట్ (9154970454) నంబరులో సంప్రదించండిలి**

**భక్తుల ఆరోగ్యం, భద్రత విషయంలో భాగస్వాములుకండిలి**

**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ఇంద్రకీలాద్రి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ప్రభుత్వం అన్ని విధాలా పటిష్ట ఏర్పాట్లు చేస్తోందని.. అయితే మరోవైపు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు కూడా భక్తులకు బిస్కట్లు, ఇతర ఆహార పదార్థాలు పంపిణీ చేస్తుంటారని.. అయితే ఇలా పెద్ద మనసుతో, భక్తిభావంతో భక్తులకు ఆహార సేవ చేసేందుకు ముందుకొచ్చే వారు తొలుత కలెక్టరేట్ (91549 70454) నంబరులో సంప్రదించి, నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారమిక్కడ ఓ ప్రకటనలో కోరారు. భక్తుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలను అధికారుల ధ్రువీకరణ అనంతరం నిర్వహించాలన్నారు. స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చే వారికి అధికారులు తగిన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, అవసరమైన భక్తులకు ఆహార పదార్థాలు చేరేలా సమన్వయం చేసి సహాయ సహకారాలు అందిస్తారని వివరించారు. అమ్మవారి సేవలో భక్తులు నిమగ్నమై ఉంటే.. ఆ భక్తులకు సేవలందిస్తున్న అధికార యంత్రాంగానికి సహకరిస్తూ, దసరా మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు కీలక భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.






# బాలల స్నేహపూర్వక జిల్లాగా ఎన్టీఆర్ జిల్లా

**చిన్నారుల హక్కులకు రక్షణ, భవిష్యత్తుకు భరోసా**

**విద్య, ఆరోగ్యం, పోషణతో పాటు భద్రతకు ప్రాధాన్యం**

**రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి అధికారులతో భేటీ**

బాలల హక్కులను పరిరక్షిస్తూ వారికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ ఎన్టీఆర్ జిల్లాను బాలల స్నేహపూర్వక జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలత, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కె.జి.వెంకట పద్మలత బుధవారం విజయవాడలో పర్యటించారు. పలు విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ కేంద్రాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. నలంద విద్యానికేతన్ సిబ్బందితో మాట్లాడి ప్రతి తరగతిగదిలో చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు, సలహాల పెట్టె ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.

తరువాత ప్రజాశక్తినగర్‌లోని అంగన్వాడీ కేంద్రాన్ని, సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో బాలల భిక్షాటనను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం బాలల కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయాలని, గ్రామ, వార్డు స్థాయిలో బాల్య వివాహాల పర్యవేక్షణ కమిటీలను మరింత బలోపేతం చేయాలన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన అన్ని సదుపాయాలు, సహకారం అందిస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.




## ఇల్లందు ఆసుపత్రిలో పరిశుభ్రత కార్యక్రమం

ఇల్లందు, అక్టోబర్ 7 : సింగరేణి ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో స్పెషల్ క్యాంపెయిన్-6లో భాగంగా బుధవారం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రపరుస్తూ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పరిశుభ్రమైన వాతావరణం ప్రాధాన్యాన్ని చాటిచెప్పారు. కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ప్రాంగణం, భవనాల పరిసర ప్రాంతాలు, రహదారులు, ఖాళీ ప్రదేశాలను శుభ్రపరిచారు. వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే ఆసుపత్రి పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. పరిశుభ్రత ఆరోగ్యానికి తొలి అడుగని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు కూడా పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. మొక్కల సంరక్షణ, వ్యర్థాల సరైన నిర్వహణ, పరిశుభ్రత వంటి అంశాల్లో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రమైన పరిసరాలు ఎంతో అవసరమని వివరించారు. "పరిశుభ్రమైన కార్యా లయం – ఆరోగ్యకరమైన వాతావర ణం" అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు చేరవేశారు. ఉద్యోగులు తమ కార్యాలయాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. పరిశుభ్రత పట్ల బాధ్యతాయుత దృక్పథం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఆర్మ్ రెజ్లింగ్‌లో రాధికకు కాంస్య పతకం

**డీజీపీ అభినందనలు**

**తెలంగాణ పోలీసులకు గర్వకారణం**

**జాతీయ స్థాయిలో ప్రతిభకు గుర్తింపు**




**హైదరాబాద్, అక్టోబర్ 7 :**
75వ అఖిల భారత పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ క్రీడా పోటీలలో మహిళల 90 కిలోలకుపైబడిన విభాగం ఆర్మ్ రెజ్లింగ్ పోటీలో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన మహిళా పోలీసు కానిస్టేబుల్ జి. రాధిక కాంస్య పతకం సాధించారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక పోటీలలో రాధిక చూపిన ప్రతిభ రాష్ట్ర పోలీసు శాఖకు గౌరవాన్ని తీసుకువచ్చింది. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఆమె సాధించిన విజయం ఇతర సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అధికారులు పేర్కొన్నారు. కఠోర సాధన, పట్టుదల, అంకితభావంతో ఈ ఘనతను అందుకున్న రాధికను సహచరులు అభినందించారు. ఈ విజయంపై తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ప్రత్యేకంగా స్పందించి రాధికకు అభినందనలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేస్తూనే క్రీడా రంగంలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు సిబ్బందిలో ఎన్నో ప్రతిభావంతులు ఉన్నారని, వారికి తగిన అవకాశాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మరిన్ని విజయాలు సాధించే సామర్థ్యం ఉందని అన్నారు. రాధిక విజయం తెలంగాణ పోలీసు శాఖలోని క్రీడా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ పోలీస్ క్రీడల వార్షిక ప్రణాళికను అఖిల భారత పోలీస్ క్రీడల ప్రణాళికతో అనుసంధానం చేయడం వల్ల సిబ్బందికి విస్తృత అవకాశాలు లభిస్తున్నాయని డీజీపీ తెలిపారు. గతంతో పోలిస్తే ఇప్పుడు మరింత మంది సిబ్బంది వివిధ క్రీడల్లో పాల్గొనే అవకాశం పొందుతున్నారని చెప్పారు. క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతోందని పేర్కొన్నారు. ఇది ఉద్యోగ నిర్వహణలో కూడా సానుకూల ఫలితాలు ఇస్తోందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన క్లస్టర్ విధానం వల్ల వివిధ క్రీడాంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం లభించిందని అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా క్రీడాకారులు ముందుగానే తమ పోటీల గురించి తెలుసుకుని సమగ్రంగా సాధన చేసుకునే అవకాశం పొందుతున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన సమయాన్ని కేటాయించుకోవడంతో పాటు శిక్షణను మెరుగుపరుచుకునే అవకాశాలు కూడా పెరిగాయని పేర్కొన్నారు. దీని ఫలితంగానే తెలంగాణ పోలీసు సిబ్బంది జాతీయ వేదికలపై మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. రాధిక సాధించిన కాంస్య పతకం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా మొత్తం తెలంగాణ పోలీసు శాఖకు గర్వకారణమని క్రీడా విభాగం అధికారులు తెలిపారు. మహిళా సిబ్బంది కూడా అన్ని రంగాల్లో సమానంగా రాణించగలరనే విషయాన్ని ఆమె నిరూపించారని అన్నారు. క్రీడా రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు శాఖ తీసుకుంటున్న చర్యలకు ఈ విజయం మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు. యువ సిబ్బందికి రాధిక ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.

# క్యాన్సర్ పోరాటానికి 'గీతం పూర్వ విద్యార్థి సైకిల్ యాత్ర'

**ఆసియా పసిఫిక్ రైడ్ లో భారత్ ప్రతినిధి**

**నిధుల సేకరణే లక్ష్యం.. 1800 కి.మీ సైక్లింగ్ రిలే**

**త్రిలోక్ స్ఫూర్తివంతమైన నేపథ్యం**

**టాటా మెమోరియల్ ఆస్పత్రికి చేయూత**

**సంగారెడ్డి ప్రతినిధి, 7 అక్టోబర్ :**



ముంబైలోని టాటా మెమోరియల్ ఆస్పత్రికి క్యాన్సర్ పరిశోధన, రోగుల సంరక్షణ కోసం నిధులు సేకరించాలనే లక్ష్యంతో, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ నేతృత్వంలో, యూనియన్ ఫర్ ఇంటర్నేషన్ క్యాన్సర్ కంట్రోల్ (యూఐసీసీ) మద్దతుతో జరుగుతున్న అంతర్జాతీయ సైక్లింగ్ కార్యక్రమం సీ2సీ4సీ (కాంటినెంట్ 2 కాంటినెంట్ 4 క్యాన్సర్) ఆసియా పసిఫిక్ రైడ్ లో గీతం పూర్వ విద్యార్థి త్రిలోక్ కొత్తపల్లి భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2026 అక్టోబరు 6 నుండి 20 వరకు జపాన్ లో 15 రోజుల పాటు, దాదాపు 1800 కిలోమీటర్ల సైక్లింగ్ రిలేలో ఆస్ట్రేలియా, చైనా, భారతదేశం, జపాన్, సింగపూర్, అమెరికా వంటి ఆరు దేశాల నుండి 55 మందికి పైగా రైడర్లు ఐదు జట్లుగా పాల్గొంటున్నారు, త్రిలోక్ అక్టోబరు 12–14 మధ్య నగానాలోని ఉయెడా నుంచి గిఫు వరకు సైకిల్ యాత్ర చేసే మూడో బృందంలో భాగమయ్యారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ లో బీటెక్, పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ పూర్తిచేసిన హైదరాబాద్‌లోని బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్ ఉద్యోగి త్రిలోక్, ఓర్పును పరీక్షించే క్రీడలపై తనకున్న మక్కువతో ఈ సేవలో పాలుపంచుకుంటున్నారు. క్యాన్సర్ తన కుటుంబాన్ని కూడా తాకిందని, రోగులు, వారి కుటుంబాలు మోసే అనిశ్చితి, దృఢత్వం, ఆశను తాను చూశానని, ఒక పెద్ద ఆశయానికి తోడ్పడటానికి ఎండ్యూరెన్స్ క్రీడలను ఉపయోగించాలనుకున్నానని త్రిలోక్ తన ఆశయాన్ని వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో త్రిలోక్ వ్యక్తిగతంగా లక్ష రూపాయలు, భారతీయ సీ2సీ4సీ రైడర్ బృందం సమిష్టిగా దాదాపు 12 లక్షల రూపాయల నిధులను సేకరించింది, ఈ నిధులు క్యాన్సర్ పరిశోధన, రోగుల సంరక్షణకు టాటా మెమోరియల్ ఆస్పత్రికి అందజేస్తారు.

# ఏసీపీ భగత్ సస్పెన్షన్, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి ఫోరం

**జర్నలిస్టుల వేధింపులపై ఆరోపణలు.. ఢిల్లీ పోలీసుల తీరుపై ఫోరం ఖండన**

**క్రైమ్ బ్రాంచ్ చర్యలపై విచారం.. తక్షణమే స్పందించాలని డిమాండ్**

**న్యూస్ డెస్క్, 7 అక్టోబర్ :**

ఢిల్లీ ఏసీపీ వివేక్ భగత్ ముగ్గురు మహిళా జర్నలిస్టులను వేధించారనే ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో ఢిల్లీ పోలీసులు నిరాకరించడాన్ని ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ తీవ్రంగా ఖండించింది. ఫోరం కన్వీనర్ కె. రామచంద్ర మూర్తి, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ రమా మెల్కోటే, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి, డా. గోపాల్ రెడ్డి గాదే, హైకోర్టు సీనియర్ న్యాయవాది జి. జ్యోతి కిరణ్ లు సోమవారం విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. ఆదివారం ఏసీపీ వివేక్ భగత్‌పై మూడు ఫిర్యాదులు అందినప్పటికీ, వాటిని విచారణ నిమిత్తం క్రైమ్ బ్రాంచ్‌కు పంపించినా, ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం విచారకరమని ఫోరం పేర్కొంది. మహిళలను వేధించడం తన అధికారిక విధుల్లో భాగమే అన్నట్లు ఆ అధికారి వ్యవహరిస్తున్నారని, వివేక్ భగత్ ప్రవర్తన ఉన్నతాధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యకరమని వారు అన్నారు. ముగ్గురు జర్నలిస్టుల్లో ఇద్దరు గతంలోనూ సదరు ఏసీపీపై ఫిర్యాదు చేసినా, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఏసీపీ వివేక్ భగత్ ను సస్పెండ్ చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫోరం డిమాండ్ చేసింది.

# 'పోలీస్ ఫ్లాగ్ డే' ఫోటో, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

**రాష్ట్రస్థాయి పోటీల ప్రకటన**

**పోటీల నిబంధనలు, చివరి గడువు.. ఎంట్రీల సమర్పణ విధానం**

**ఔత్సాహికులకు జిల్లా ఎస్పీ పిలుపు**

**నారాయణఖేడ్ నియోజకవర్గం, 7 అక్టోబర్ :**



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. పోలీసుల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు నేపథ్యంగా 2025 అక్టోబర్ నుండి 2026 అక్టోబర్ మధ్య తీసిన 3 ఫోటోలు, 3 నిమిషాల నిడివి మించని షార్ట్ ఫిల్మ్‌లను ఈ నెల 22వ తేదీలోపు సమర్పించాలని ఆయన సూచించారు. 10ఇ8 అంగుళాల పరిమాణంలో తీసిన 3 ఫోటోలను హార్డ్, సాఫ్ట్ కాపీలతో, షార్ట్ ఫిల్మ్‌ను పెన్ డ్రైవ్‌లో సాఫ్ట్ కాపీ రూపంలో సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలోని పి.ఆర్.ఓ. సెక్షన్‌లో అందజేయాలి. జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ మూడు షార్ట్ ఫిల్మ్‌లు, మూడు ఫోటోలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తారు, అక్కడ ఎంపికైన వారికి మెరిట్ సర్టిఫికెట్లు అందజేయబడతాయి. సంగారెడ్డి జిల్లాలోని ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్ ఫిల్మ్ మేకర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పోలీసు సేవలు, విధి నిర్వహణ ప్రతిబింబించే మంచి ఎంట్రీలు పంపాలని ఎస్పీ కోరారు. మరింత సమాచారం కోసం పి.ఆర్.ఓ. నంబర్ 8712539040 సంప్రదించవచ్చు.

# కృత్రిమ కరవు, రైతుల కన్నీళ్లకు పాలకులే కారణం 'క్రాంతి కిరణ్'

**కాంగ్రెస్ నిర్లక్ష్యంపై మాజీ ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపాటు**

**కేసీఆర్ పాలన స్వర్ణయుగం, ప్రస్తుతం కరవు రాజ్యం**

**సింగూర్ నీరు, విద్యుత్‌పై మంత్రి దామోదర వైఫల్యం**

**ఆందోల్ మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించాలి**

**నిరంతర విద్యుత్ ఇవ్వకుంటే పోరాటాలు ఉధృతం కాంగ్రెస్‌కు హెచ్చరిక**



**ఆందోల్-జోగిపేట నియోజకవర్గం, 7 అక్టోబర్ :**

ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్రంలో 'కృత్రిమ కరవు' ఏర్పడిందని, పాలకుల ముందుచూపు లేని నిర్లక్ష్యమే రైతుల కన్నీళ్లకు కారణమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎల్ నినో ప్రభావంపై వాతావరణ నిపుణుల హెచ్చరికలను ప్రభుత్వం విస్మరించిందని ఆయన ధ్వజమెత్తారు. పుల్కల్ మండలంలో నిర్వహించిన భారీ రైతు ధర్నాలో పాల్గొని మాట్లాడుతూ, కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులు సాగునీరు, 24 గంటల నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్, సకాలంలో రైతుబంధు, రైతుబీమాతో రారాజుల్లా బతికారని, వ్యవసాయం పండుగలా మారిందని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కుప్పకూల్చిందని, రిజర్వాయర్లలో నీటిని పొదుపుగా వాడుకోకుండా, చేతిలో బొగ్గు నిల్వలు ఉన్నా విద్యుత్ ఉత్పత్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఆందోల్ రైతాంగానికి జీవనాడి అయిన సింగూర్ ప్రాజెక్టు నీటిని, అక్కడ ఉత్పత్తి అయ్యే జల విద్యుత్‌ను స్థానిక వ్యవసాయ అవసరాలకు కేటాయించడంలో స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. పంటలు ఎండిపోయి, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్న నేపథ్యంలో, ఆందోల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను వెంటనే కరవు మండలాలుగా ప్రకటించి, నష్టపోయిన ప్రతి ఎకరానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్‌ను వెంటనే పునరుద్ధరించకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఆగ్రహ జ్వాలల్లో భస్మమవడం ఖాయమని హెచ్చరించారు. అన్నదాతలకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి పోరాటాలను ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, పెద్ద ఎత్తున రైతాంగం పాల్గొన్నారు.

# 'హెచ్ఎండీఏ' ప్లాట్లపై తుది గడువు

**సంగారెడ్డి కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష**

**జగ్గారెడ్డి, నిర్మల డిమాండ్**

**రైతులకు నవంబర్ నెలాఖరులోగా ప్లాట్లు**

**ఆలస్యంపై అధికారుల వివరణ**

**పనుల వేగవంతానికి కలెక్టర్ ఆదేశాలు**

**న్యూస్ డెస్క్, 7 అక్టోబర్ :**



సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని ఆరుట్ల, ఇంద్రకరణ్, ఫసల్‌వాది, కంది ప్రాంతాల్లో హెచ్ఎండీఏ ల్యాండ్ పూలింగ్ లే అవుట్లలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపుపై సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన, హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి పాల్గొని, గత ప్రభుత్వ హయాంలో భూములు తీసుకుని రైతులకు సర్టిఫికెట్లు ఇచ్చినా, ఇప్పటివరకు ప్లాట్ల పొజిషన్ ఇవ్వకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు, పనులు ఎందుకు ఆలస్యమయ్యాయో అధికారులను ప్రశ్నించారు. ఆరుట్ల లే అవుట్ (106.14 ఎకరాలు) ప్రక్రియ పూర్తయినా లబ్ధిదారుల జాబితా అందలేదని, ఫసల్‌వాది భూసేకరణ 60 శాతం పూర్తయిందని, కొంత ప్రాంతంలో రైతుల అభ్యంతరాలున్నాయని, కంది లే అవుట్ (50 ఎకరాలకు ప్రతిపాదన, 46 ఎకరాలు అందుబాటులో) లబ్ధిదారుల జాబితా పెండింగ్‌లో ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కంది లే అవుట్ పనులు ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేస్తామని, ఫసల్‌వాది, ఆరుట్ల లే అవుట్లను కూడా త్వరితగతిన సిద్ధం చేస్తామని, నవంబర్ చివరికల్లా రైతులకు ప్లాట్లు కేటాయిస్తామని హెచ్ఎండీఏ అధికారులు హామీ ఇచ్చారు. మిగిలిన పనులు పూర్తి చేసి, రైతులు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నందున ప్రక్రియలో మరింత జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా ప్లాట్లు కేటాయించాలని జగ్గారెడ్డి కోరారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ జోక్యం చేసుకుని, హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్ సమస్యలను పరిష్కరించి, నవంబర్ చివరికల్లా భూములు కోల్పోయిన రైతులందరికీ ప్లాట్లు కేటాయించేలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# రోడ్లు, విద్యుత్ కష్టాలపై 'మాజీ ఎమ్మెల్యే పోరు'



**మాజీ ఎమ్మెల్యే నిరసన**

**రోడ్ల దుస్థితి, విద్యుత్ కష్టాలు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**

**పోరాటం కొనసాగిస్తాం**

**నారాయణఖేడ్ నియోజకవర్గం, 7 అక్టోబర్ :**

నాగల్‌గిద్ద మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రోడ్ల నిర్మాణం, గుంతల పూడ్చివేత, రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి కారముంగి నుండి కారస్‌గుత్తి వరకు పాదయాత్ర, ధర్నా నిర్వహించారు. అనంతరం, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ రైతులతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు, విద్యుత్ సమస్యలను పరిష్కరించి పంటలను కాపాడాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నారాయణఖేడ్ డబుల్ లైన్ రోడ్డుతో పాటు అనేక రోడ్లను, నాలుగు కొత్త చెరువులను మంజూరు చేయించానని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాను మంజూరు చేయించిన రోడ్లను పూర్తి చేయలేకపోయిందని, కనీసం ఇప్పటికే ఉన్న రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేని దుస్థితిలో ఉందని తీవ్రంగా మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని, కమిషన్ల ప్రభుత్వమని ఆయన ఆరోపించారు, ఎన్నికల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, స్థానిక ఎమ్మెల్యేకు ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులు పట్టడం లేదని ప్రశ్నించారు. సరైన విద్యుత్ సరఫరా లేక రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం రైతులను సబ్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతోందని విమర్శించారు. రోడ్లు లేవు, కరెంటు లేదు, పంటలు ఎండిపోతున్నాయి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే పదవిలో ఉండి ప్రయోజనం ఏమిటని భూపాల్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు, లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ప్రజల ఆగ్రహానికి మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీ, గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# యూరప్‌లో ఎన్టీఆర్, ఆలియా సందడి

సినీ తారలు వరుస షూటింగ్స్‌తో ఎంత బిజీగా ఉన్నా.. కాస్త విరామం దొరికితే కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి విదేశీ వెకేషన్‌కు వెళ్లడం సర్వసాధారణం. ప్రస్తుతం టాలీవుడ్ యంగ్‌టైగర్ జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ కూడా తమ బిజీ షెడ్యూల్‌కు చిన్న విరామం ఇచ్చి యూరప్‌లో సందడి చేస్తున్నట్లు సమాచారం. ఆలియా స్పెయిన్‌లో స్నేహితురాళ్లతో గడుపుతుండగా.. ఎన్టీఆర్ భార్య లక్ష్మీ ప్రణతితో కలిసి ఇటలీలో హాలిడేను ఆస్వాదిస్తున్నారు. ఆలియా భట్ ప్రస్తుతం స్పెయిన్‌లోని అందమైన మల్లోర్కా దీవిలో స్నేహితురాళ్లతో కలిసి సమయాన్ని గడుపుతున్నట్లు తెలుస్తోంది.

**హైదరాబాద్, అక్టోబరు 7 :**

అక్కడి సముద్ర తీరాలు, ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలను ఆస్వాదిస్తూ వెకేషన్ జ్ఞాపకాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటోంది. ఈ సందర్భంగా ఆలియా తన ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ ఫొటోను కూడా మార్చింది. ఎరుపు రంగు గౌను ధరించి సూర్యాస్తమయాన్ని ఆస్వాదిస్తున్న ఫొటోను డీపీగా పెట్టుకోవడంతో అభిమానుల దృష్టిని ఆకర్షించింది మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ తన భార్య లక్ష్మీ ప్రణతితో కలిసి ఇటలీలో హాలిడేను ఆస్వాదిస్తున్నట్లు సమాచారం. సన్నిహిత స్నేహితులతో కలిసి యూరప్ పర్యటనకు వెళ్లిన ఈ దంపతులకు సంబంధించిన కొన్ని క్యూట్, క్యాండిడ్ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వరుస షూటింగ్స్, ప్రమోషన్స్‌తో బిజీగా ఉండే తారక్.. దొరికిన ఈ విరామాన్ని భార్యతో కలిసి ప్రశాంతంగా గడుపుతున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ కుటుంబంతో కలిసి విదేశాల్లో రిలాక్స్ అవుతుండటం నందమూరి అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇదిలా ఉంటే.. సూపర్‌స్టార్ మహేష్ బాబు కూడా త్వరలో కుటుంబంతో కలిసి విదేశీ వెకేషన్‌కు వెళ్లనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 'వారణాసి' చిత్రీకరణలో బిజీగా ఉన్న మహేష్.. ఈ వారంలో షూటింగ్ పూర్తి చేసుకుని కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది.

# మాజీ ప్రియుడి గురించి..

## – గాయత్రి సురేష్



**కొచ్చి, అక్టోబరు 7 :**

ప్రముఖ మలయాళ నటి గాయత్రి సురేష్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సంచలన విషయాలను వెల్లడించింది. ప్రస్తుతం 'బిగ్‌బాస్ మలయాళం' ఎనిమిదో సీజన్‌లో పాల్గొన్న ఆమె శనివారం ప్రసారమైన ఎపిసోడ్‌లో ఎలిమినేట్ అయింది. షో నుంచి బయటకు వెళ్లే ముందు ఓ టాస్క్‌లో భాగంగా తన గతంలోని చేదు అనుభవాలను గాయత్రి పంచుకుంది. 2015లో 'జమ్నా ప్యారీ' చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసిన గాయత్రి.. 2021లో తాను ఓ వివాదంలో చిక్కుకున్న సమయంలో ఓ వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నానని తెలిపింది. ఆ బంధం మొదలైన మొదటి వారంలోనే సదరు వ్యక్తి తనను తీవ్రంగా బాధించేలా ఓ ప్రశ్న అడిగాడని చెప్పింది. ఆ మాటతోనే అతడి వ్యక్తిత్వంపై తనకు స్పష్టత వచ్చిందని, అప్పటి నుంచి అతడితో మాట్లాడటం మానేశానని పేర్కొంది. తన జీవితంలో చాలామంది బాధపెట్టినా, 2021లో జరిగిన సంఘటన మాత్రం తనను తీవ్రంగా గాయపరిచిందని గాయత్రి తెలిపింది. తాను పరిపూర్ణమైన వ్యక్తిని కాదని, తనలోనూ కొన్ని చెడు అలవాట్లు ఉన్నాయని అంగీకరించిన ఆమె.. అయితే తన మనసు స్వచ్ఛమైనదని, ఎవరినీ కావాలని బాధపెట్టాలని అనుకోనని చెప్పింది. అదే సమయంలో జరిగిన కారు ప్రమాదం గురించి కూడా గాయత్రి వివరించింది. 2021 అక్టోబరులో తన స్నేహితురాలితో కలిసి కారులో ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపింది. ఆ సమయంలో తన స్నేహితురాలే కారు నడుపుతున్నారని, మరో వాహనాన్ని ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుందని చెప్పింది.



# 'క్రేజీ కల్యాణం' రిలీజ్ డేట్ మారింది.. ఎప్పుడంటే?

టాలెంటెడ్ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త తెలుగు చిత్రం 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పూర్తిస్థాయి కుటుంబ వినోద చిత్ర విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. తొలుత అక్టోబరు 30న విడుదల చేయాలని భావించిన మేకర్స్.. తాజాగా రెండు వారాల ముందుగానే అక్టోబరు 16న ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్నట్లు ప్రకటించారు.

అనుపమ పోస్ట్‌తో అధికారిక ప్రకటన

విడుదల తేదీ మారిన విషయాన్ని అనుపమ పరమేశ్వరన్ సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకుంది. 'క్రేజీ కల్యాణం ముహూర్తం ఫిక్స్.. అక్టోబర్ 16న మీ అభిమాన థియేటర్లలో కలుద్దాం' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. దీంతో సినిమా విడుదల తేదీపై స్పష్టత వచ్చింది.

కామెడీ, కుటుంబ భావోద్వేగాలతో రూపొందుతున్న ఈ చిత్రం అక్టోబరు 16న థియేటర్లలోకి రానుంది.



# 'జైలర్ 2' సెన్సార్ పూర్తి

సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' విడుదలకు సిద్ధమవుతోంది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అక్టోబరు 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి 'యూ/ఏ 16 ప్లస్' సర్టిఫికేట్ జారీ చేసినట్లు సమాచారం. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న సెన్సార్ వివరాల ప్రకారం 'జైలర్ 2' నిడివి 165 నిమిషాల 18 సెకన్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. అంటే దాదాపు 2 గంటల 45 నిమిషాల నిడివితో సినిమా ఉండనుంది. 2023లో వచ్చిన 'జైలర్' రన్‌టైమ్ సుమారు 168 నిమిషాలు కాగా.. దానితో పోలిస్తే సీక్వెల్ నిడివి దాదాపు మూడు నిమిషాలు తక్కువగా ఉంది. అయితే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న సెన్సార్ వివరాలపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి ముత్తువేల్ పాండియన్ పాత్రలో కనిపించనున్నారు. తొలి భాగం ఘన విజయం సాధించడంతో సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎస్.జే. సూర్య, విద్యాబాలన్, సూరజ్ వెంజారమూడు, మిథున్ చక్రవర్తి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ కూడా ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం, నేపథ్య సంగీతం కూడా చిత్రానికి ప్రధాన బలంగా నిలవనున్నాయి.

# ట్రోలింగ్‌పై రష్మిక ఘాటు సమాధానం

**హైదరాబాద్, అక్టోబరు 7 :**



టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్‌గా గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. వీరిద్దరూ కలిసి నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' అక్టోబరు 16న దసరా కానుకగా థియేటర్లలోకి రానుంది. దీంతో చిత్రబృందం ప్రమోషన్లను ముమ్మరం చేసింది. వరుస ఇంటర్వ్యూలు, కార్యక్రమాలతో సినిమాపై అంచనాలు పెంచుతోంది. సినిమా ప్రమోషన్ల కంటే విజయ్, రష్మికల వ్యక్తిగత అనుబంధానికి సంబంధించిన అంశాలే ఎక్కువగా చర్చకు వస్తున్నాయి. మరోవైపు ప్రమోషన్ కార్యక్రమాల్లో రష్మిక ఎంతో ఉత్సాహంగా, సరదాగా కనిపించడంపై కొందరు నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. ఆమెను 'ఓవరాక్షన్', 'క్రింజ్' అంటూ ట్రోల్ చేస్తున్నారు. తాజా ఇంటర్వ్యూలో ఇదే విషయంపై రష్మికకు ప్రశ్న ఎదురైంది. దీనిపై ఆమె ఎలాంటి మొహమాటం లేకుండా స్పందించింది. తాను ఎక్కడ ఉన్నా అక్కడి వాతావరణాన్ని సంతోషంగా ఉంచాలని కోరుకుంటానని చెప్పింది. చుట్టూ ఉన్నవారితో సరదాగా మాట్లాడటం, నవ్వుతూ ఉండటం తన సహజ స్వభావమని పేర్కొంది.




# 'ది ప్యారడైజ్' ఓటీటీ ఎప్పుడు?

**హైదరాబాద్, అక్టోబరు 7 :**

నేచురల్ స్టార్ నాని, 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. సెప్టెంబరు 24న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనను అందుకున్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబడుతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.180 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ విడుదలపై ఆసక్తి నెలకొంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల్లోనూ, విదేశీ మార్కెట్లలోనూ 'ది ప్యారడైజ్'కు మంచి వసూళ్లు వస్తున్నట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో థియేటర్లు ప్రేక్షకులతో సందడిగా కనిపిస్తున్నాయి. నాని సరసన కయాదు లోహర్ కథానాయికగా నటించగా.. 'శికంజా మాలిక్' అనే కరడుగట్టిన ప్రతినాయకుడి పాత్రలో మోహన్‌బాబు కనిపించారు. రాఘవ్ జుయేల్, సంపూర్ణేష్ బాబు, ప్రియదర్శి, సోనాలి కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. థియేటర్లలో సినిమాను చూడటం మిస్సయిన ప్రేక్షకులు ఓటీటీ విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467